
సాక్షి విశాఖపట్నం
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



బై బై వైజాగ్

భారత్ క్రికెటర్లు రోహిత్ శర్మ, శుభమన్ గిల్ తదితరులు మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. 8లో



మిలాన్‌కు చురుగ్గా ఏర్పాట్లు

నగరంలో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు జరిగే మిలాన్–2024కు సాగర తీరం సిద్ధమవుతోంది. 8లో



విమ్స్‌లో 9న ఇంటర్వ్యూలు

విమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్య పోస్టుల భర్తీకి 9న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. 8లో

భూ బకాసురులపై ఉక్కుపాదం



- ఈ వివాదాల కారణంగానే ఎక్కువ శాతం భౌతిక దాడులు, హత్యలు
- వీటి పరిష్కారానికి పోలీస్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక కమిటీ
- ప్రీ లిటిగేషన్ కమిటీ సమక్షంలో భూ యజమానులకు న్యాయం
- భూకబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు
- అవసరమైతే నగర బహిష్కరణ
- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ హెచ్చరికలు

విశాఖ సిటీ: భూ బకాసురులపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్ శాఖ సమాయత్తమైంది. భూ ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. భూ తగాదాల కారణంగానే జిల్లాలో శాంతి భద్రతలకు ప్రధానంగా విఘాతం కలుగుతోంది. వీటి ఫలితంగానే భౌతిక దాడులు, హత్యలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇటువంటి భూవివాదాలకు చెక్ పెడితే నగరంలో నేరశాతం తగ్గుముఖం పడుతుందని పోలీస్ శాఖ భావిస్తోంది. ఇందుకోసం రెవెన్యూ అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆలోచన చేస్తున్నారు. ఒకవైపు భూఆక్రమణలు చేసే వారిపై చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు భూ వివాదాలపై దృష్టిసారించి వాటిని పరిష్కరించడం ద్వారా జిల్లాలో భూతగాదాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

రెచ్చిపోతున్న ఆక్రమణదారులు

విశాఖ అన్ని రంగాల్లో విశేషంగా అభివృద్ధి చెందుతోంది. పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. బహుళ జాతి కంపెనీలు వస్తుండడంతో విశాఖలో భూముల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో కొంత మంది కబ్జాదారులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. ఇప్పటికే అనేక వేల ఎకరాలను అన్యాక్రాంతం చేశారు. నకిలీ రికార్డులు సృష్టించి ఆక్రమించేశారు. మరికొంత మంది ఇళ్లలో అద్దెకు దిగి.. తరువాత అద్దె ఇవ్వకుండా.. ఖాళీ చేయకుండా.. యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలా నగరంలో కొందరు పేట్రేగిపోతున్నారు. ఈ తరహా ఫిర్యాదులు పోలీస్ స్పందన, డయల్ యువర్ సీపీ ద్వారా ఎక్కువగా వస్తున్నాయి. దీంతో ఇటువంటి వారిపై గట్టి చర్యలకు నగర పోలీస్ శాఖ ఉపక్రమిస్తోంది. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి నగరంలో భూకబ్జాలకు పాల్పడిన, ఇళ్లలో అద్దెకు దిగి వాటిని ఆక్రమించుకోడానికి ప్రయత్నించిన వారిని ఉపేక్షించకూడదన్న నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ కబ్జాదారులకు హెచ్చరికలు జారీ చేశారు.

భూకబ్జాలకు పాల్పడితే నగర బహిష్కరణే..

ప్రశాంత విశాఖలో భూబకాసురులు అలజడి సృష్టిస్తున్నారు. ఖాళీగా స్థలాలు కనిపిస్తే వాటిని కాజేయడానికి రాక్షస ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలతో పాటు దేవదాయ, వక్ఫ్‌బోర్డ్‌కు చెందిన భూములలో పాగా వేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు చెందిన జిరాయితీ స్థలాలను కూడా విడిచిపెట్టడం లేదు. ఆ స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రాజకీయనాయకులు, కొంత మంది పెద్దల పేర్లు చెప్పి కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి కొంత మంది ప్రభుత్వ అధికారులతో పాటు పోలీసులు, న్యాయవాదులు అండగా నిలుస్తున్నారు. దీంతో యజమానులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటువంటి తరహా ఫిర్యాదులు ఎక్కువవుతుండడంతో కబ్జాదారులు, వారికి సహకరించిన వారిపై కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతున్నారు. భూకబ్జాలకు పాల్పడిన వారిని ఏపీ ల్యాండ్ గ్రాబింగ్(ప్రొహిబిషన్)యాక్ట్, 1982 ప్రకారం పీడీ యాక్ట్ కింద అరెస్టు చేయడంతో పాటు అవసరమైతే నగర బహిష్కరణ కూడా విధించాలని నిర్ణయించారు. అదే విధంగా ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, పిల్లలు దూరంగా ఉన్న తల్లిదండ్రులు, ఎటువంటి ఆసరా లేని ఒంటరి కుటుంబాల భూములు, ఆస్తుల కబ్జాకు గానీ, మోసం చేయడానికి గానీ ప్రయత్నించినా, వారికి సహకరించినా వారిపై మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ కబ్జాదారులకు సహకరించే పోలీసులు, అడ్వకేట్లు, రిటైర్డ్ ఎంఆర్‌ఓలు, వీఆర్వోలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఈ భూ కబ్జాలకు పాల్పడితే వారిపై విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే భూకబ్జాలకు పాల్పడుతున్న వారిని, అద్దె ఇళ్ల దురాక్రమణదారులను, ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన ముఠాలను పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారికి సహకరించే వారిపై నిఘా పెడుతున్నారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని సీపీ హెచ్చరించారు.

ప్రీ లిటిగేషన్ కమిటీ సమక్షంలో న్యాయం

భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ప్రీ లిటిగేషన్ కమిటీ సమక్షంలో న్యాయం జరిగేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇందులో లీగల్, రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ, సంబంధిత శాఖాధికారుల ఆధ్వర్యంలో వివాదాల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. ఈ కమిటీ ద్వారా వివాదాలను పరిష్కరించి నిజమైన భూయజమానులకు న్యాయం జరిగేలా చూస్తున్నారు. ఈ కమిటీ ద్వారా సత్ఫలితాలు వస్తుండడంతో మరిన్ని వివాదాలను కమిటీలో పెట్టి పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆ మాటే స్ఫూర్తి మంత్రం



హాజరైన విద్యార్థులు



చిన్నారుల నృత్య ప్రదర్శన



ప్రసంగిస్తున్న నిక్

- యువతలో ఉత్తేజం నింపిన నిక్ ప్రసంగం
- ఆద్యంతం సందేశాత్మకం

ఏయూక్యాంపస్: జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవాలి. జీవితం విలువ గుర్తించాలి. జీవితంలో మనం జీవించాలి. సంపద పెంచుకోవడం కంటే ప్రేమను పంచడం ఎంతో విలువైన అంశం అంటూ యువతకు దిశానిర్దేశం చేశారు ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వేదికగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక ప్రసంగం యువతలో కొత్త ఉత్సాహాన్ని, వారిలో నూతన శక్తిని నింపింది. విశ్వనగరంగా మారుతున్న విశాఖలో ఇటువంటి స్ఫూర్తిదాయక ప్రసంగం జరగడం ఇదే తొలిసారి. ఇంతటి మహత్తర కార్యక్రమానికి ఏయూ ఆతిథ్యం అందించి వేదికగా నిలిచింది. వేలాదిమంది విద్యార్థులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త ఉత్సాహంతో వెళ్లారు.

సమయం చూసి నేర్చుకోవాలి

నిక్ ప్రసంగం అంతా సమయ పాలనతో సాగింది. సరిగ్గా సాయంత్రం 6 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు ఏయూ వీసీ ప్రసంగం, ఇతర కార్యక్రమాలను తిలకించారు. అనంతరం 6.20 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి, సరిగ్గా గంట తరువాత 7.20 గంటలకు తన ప్రసంగాన్ని పూర్తి చేశారు. తాను చెప్పాలనుకున్న అంశాన్ని సమగ్రంగా, ఎంతో ఆసక్తిదాయకంగా, స్ఫూర్తిమంతంగా యువతకు అందించారు.

ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం

హ్యూమన్ బీయింగ్ టు బీయింగ్ హ్యూమన్ అంటూ వేలాది మంది విద్యార్థులు ఏకకాలంలో ప్రతిజ్ఞ చేశారు. అధిక సంఖ్యలో యువత ఒకే వేదిక నుంచి ప్రతిజ్ఞ చేసి ఏషియా బుక్ ఆఫ్ రికార్డును సాధించారు. దీనిని సంస్థ ప్రతినిధి దిలీప్ పాత్రో వేదికపై ప్రకటించి, ధ్రువపత్రాన్ని ఏయూ అధికారులకు అందించారు.

వసుధైక కుటుంబం ఏయూ

వసుధైక కుటుంబం అనే సూక్తిని నేడు ఏయూ నిజం చేస్తోందని వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూలో చదువుకున్న విద్యార్థులు విశ్వవ్యాప్తంగా స్థిరపడి ప్రపంచానికి సేవలు అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఏయూను అభివృద్ధి చేసి దేశంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దామన్నారు. సిటీ ఆఫ్ డెస్టినీలో ప్రారంభమైన ఏయూ ఎందరో డెస్టినీని మార్చివేసిందన్నారు.

ఆద్యంతం ఆహ్లాదకరం

యువత కోసం తీర్చిదిద్దిన కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదాన్ని, అణువణువునా స్ఫూర్తిని చాటింది. ముందుగా ఏయూ విద్యార్థిని మిస్ సౌత్ ఇండియా 2022 చరిష్మా తన ప్రసంగంతో యువతను ఆకట్టుకుంది. అనంతరం విభిన్న ప్రతిభావంతుల యువత నృత్య ప్రదర్శనలు, విశాఖ వ్యాలీ విద్యార్థుల నృత్యం, ఏయూ నృత్య, సంగీత విభాగం విద్యార్థుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, ఏయూ రంగస్థల విభాగం విద్యార్థులు నీరు, వ్యవసాయం విలువను తెలియజేసే మైమ్ ప్రదర్శన, సునీల్ ముప్పాల ప్రసంగం విద్యార్థులను కట్టిపడేశాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నిక్ చిత్రపటానికి పెన్సిల్‌తో తీర్చిదిద్ది ఆయనకు బహూకరించింది. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఏయూ ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



తాను గీసిన చిత్రంతో విద్యార్థిని జనని



మాట్లాడుతున్న మిస్ సౌత్ ఇండియా చరిష్మ

విద్యార్థుల్లో విలువలు పెంపొందించాలి

ఏయూక్యాంపస్: విద్యార్థుల్లో విలువలను పెంపొందించే దిశగా మరింత కృషి జరగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ అన్నారు. మంగళవారం ఏయూలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడానికి విచ్చేసిన ఆయనను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ తరఫున నిక్‌ని సత్కరించారు. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కలిసి పనిచేస్తామన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే దిశగా కలసి పనిచేద్దామన్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ అమెరికాలోని పెన్ స్టేట్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ నీలి బెండపూడి తమ పూర్వవిద్యార్థేనన్నారు. అమెరికాలో మరొక వర్సిటీ వైస్‌చాన్సలర్‌గా పనిచేస్తున్న అశ్విన్ ఓలేటి, బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్ వంటి వారెందరో తమ పూర్వవిద్యార్థులని తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన రెడ్డికి విద్య రంగం అంటే ఎంతో ఇష్టమని, ఉన్నత విద్య రంగానికి ముఖ్యమంత్రి సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా ఏయూలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దిన విధానం వివరించారు.



నిక్‌ని సత్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

న్యూస్‌రీల్

అమర్‌కు ఆత్మీయ స్వాగతం



దేవులపల్లి అమర్‌కు స్వాగతం పలుకుతున్న మణిరామ్

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో అమర్‌కు సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, రెవెన్యూ అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు. దేవులపల్లి అమర్ విశాఖలో మూడు రోజుల పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అధికార, రాజకీయ ప్రముఖులను కలుసుకుంటారు.

అప్పన్న సన్నిధిలో ఇంగ్లండ్ దేశస్తులు



సింహగిరిపై ఇంగ్లండ్ దేశస్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని మంగళవారం పలువురు ఇంగ్లండ్ దేశస్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. సింహగిరి అందాలను తిలకించారు. భక్తులతో కలిసి సందడి చేశారు. భారత్–ఇంగ్లండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ సందర్భంగా వీరంతా నగరానికి వచ్చారు.

తాడేపల్లిగూడెంకు ప్రచార రథం



రథాన్ని ప్రారంభిస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం : హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు మంగళవారం తరలివెళ్లింది. బుధవారం నుంచి 10వ తేదీ వరకు హిందూ ధర్మప్రచారాన్ని నిర్వహిస్తారు. రథానికి ఏఈవో భ్రమరాంబ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’కు విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విశ్వనాథన్

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ‘ఆడుదాం ఆంధ్ర’ రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9న రైల్వే స్టేడియంలో ప్రారంభ వేడుకలు జరగనుండగా రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన ఐదు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి మెన్, వుమెన్ జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ బ్రాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, జెండాలు, బిల్ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు దూర ప్రాంతాల నుంచి వస్తారు కనుక వారికి స్వాగతం పలుకుతూ రైల్వే, బస్ స్టేషన్లలో వెల్‌కం కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా విశేషాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారులు బస చేసే చోట నుంచి మైదానాలకు వచ్చే దారుల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం వరకు రోడ్లకి ఇరువైపులా ఆడుదాం ఆంధ్ర విశిష్టతను తెలిపే హోర్డింగులు, బిల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులపై ట్రాన్సిస్ట్ మోడల్‌లో స్ట్రిప్స్, జెండాలు పెట్టాలని, అందుకు అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని పేర్కొన్నారు. బ్రాండింగ్ కమిటీలోని సభ్యులు, ఆయా జోన్ల కమిషనర్లు, రాష్ట్ర, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు సంయుక్తంగా పర్యటించి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో శాప్ డీడీ రమణ, డీఎస్‌డీవో జూన్ గాలియట్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, వివిధ జోన్ల కమిషనర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సేవలు సూపర్

ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల శిక్షణ సిబ్బంది ప్రశంస




రైతు భరోసా కేంద్రం వద్ద ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల శిక్షణ సిబ్బంది, జిల్లా అధికారులు

పెందుర్తి: రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల శిక్షణ సిబ్బంది ప్రశంసించారు. అధ్యయన యాత్రలో భాగంగా పెందుర్తిలో మంగళవారం వారు పర్యటించారు. ఎయిర్ వైస్ మార్షల్ మనీష్ కుమార్ ఆధ్వర్యంలోని సభ్యులు పెందుర్తి మండలం పినగాడిలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ రైతులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. రైతులతో విస్తృతంగా చర్చలు జరిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషనర్ కార్యాలయ ఉప సంచాలకుడు వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ఉప సంచాలకుడు మోహనరావు, డివిజన్ వ్యవసాయ సహాయక సంచాలకురాలు మాణిక్యంబిక, జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ శిక్షణ కేంద్రం అధికారి సురేష్, మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

1,980 మందికి వైద్య పరీక్షలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు మంగళవారం మూడు ప్రాంతాల్లో నిర్వహించారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో వైద్య శిబిరాలు జరిగాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. మొత్తం 1,980 మందిని పరీక్షించారు. బుధవారం నగర పరిధిలో 12 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. శ్రీకాంత్‌నగర్, నరసింహానగర్, న్యూగాజువాక, నక్కవానిపాలెం, పెదగంట్యాడ, శివనగర్, నరసింహానగర్, రంగిరీజువీధి, లాసన్స్‌బే కాలనీ, దండుబజార్, మధురవాడ, దండుబజార్–2 తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదం




కొండా రాజీవ్‌గాంధీ

మహారాణిపేట: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2024–25 బడ్జెట్ అంచనాలకు ఆమోదం లభించింది. జిల్లాలోని గ్రంథాలయాల్లోని మౌలిక వసతులు, అభివృద్ధి చర్యలు చేపట్టేందుకు గాను రూపొందించిన బడ్జెట్ అంచనాలపై శ్రీనగర్ కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ సమావేశానికి అధ్యక్షత వహించగా సభ్యులు పలు అంశాలపై చర్చించి వారి సలహాలు, సూచనలు అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, 2024–25 బడ్జెట్ అంచనాలకు సంబంధించిన పద్దులపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ జి. లక్ష్మణరావు, డీపీవో కార్యాలయ ఏవో బీవీకే సత్యనారాయణ, వయోజన విద్యాశాఖ ఏడీ డి. చిన్నికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్. వెంకటరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాల స్వీకరణకు ఆన్‌లైన్ కౌంటర్లు

- సింహగిరిపై తొలివిడతగా మూడు కేంద్రాల్లో తొమ్మిది స్వైపింగ్ యంత్రాల ఏర్పాటు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



హెచ్‌డీఎఫ్ బ్యాంకు అధికారులతో చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై భక్తుల సౌకర్యార్థం స్వైపింగ్ మిషన్ల ద్వారా విరాళాలు స్వీకరించేందుకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈమేరకు మంగళవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రాష్ట్ర అధికారి ఉదయ్ గుడిపాటి, ఆ బ్యాంకుకు చెందిన పలువురు అధికారులు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులతో సమావేశమై చర్చించారు. ఆన్‌లైన్ ద్వారా విరాళాలు స్వీకరించే పద్ధతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు స్వీకరణకు దేవదాయశాఖ కసరత్తు చేస్తోందన్నారు. ఇప్పటివరకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు నుంచి సింహగిరిపై నగదు రూపంలోను, చెక్కులు, డీడీల రూపంలో స్వీకరించేవాళ్లమన్నారు. భక్తులకు మరింతగా సౌలభ్యం చేకూర్చేందుకు స్వైపింగ్ మిషన్‌ల ద్వారా విరాళాలు స్వీకరించేందుకు ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలివిడతగా అన్నదానం భవనం వద్ద, పీఆర్‌వో కార్యాలయం వద్ద, ఆలయంలోను మూడు చోట్ల తొమ్మిది స్వైపింగ్ మిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండో విడతలో మిగిలిన కేంద్రాల్లో కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రధానంగా అన్నప్రసాదానికి సంబంధించి శాశ్వత విరాళాలు, స్వల్ప విరాళాలకు సంబంధించి రెండు చోట్ల స్వైపింగ్ మిషన్లు, గో సంరక్షణకు సంబంధించి మరో స్వైపింగ్ మిషన్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయన్నారు. దేవస్థానంతో ఆ యంత్రాలు నేరుగా అనుసంధానమై ఉంటాయని, మూడో పార్టీని ఈప్రక్రియలో అనుమతించబోమని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ యంత్రాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. అలాగే సింహగిరిపై ఏటీఎమ్ కేంద్రాన్ని కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సమావేశంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, దశమంతుల రామలక్ష్మి, ముదుండి రాజేశ్వరి, సువ్వాడ శ్రీదేవి, ఏఈవో పాలూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'మూడు దారులు' పుస్తక పరిచయం

మహారాణిపేట: సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ రచించిన 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ బుధవారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో జరగనుంది. ప్రతిష్టాత్మక రూపా పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఇదే పుస్తకాన్ని అమర్ ఇంగ్లిష్‌లో కూడా రచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్ట్ వి.వి.రమణమూర్తి మూడుదారులు పుస్తకాన్ని సమీక్షిస్తారు. ఏయూ జర్నలిజం విభాగం విశ్రాంత ప్రధాన ఆచార్యుడు ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ సభకు అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ పాత్రికేయుడు మంగు రాజగోపాల్ ఆత్మీయ ప్రసంగం చేస్తారు. రచయిత దేవులపల్లి అమర్ స్పందనతో సభా కార్యక్రమం ముగుస్తుంది. తెలుగు నాట రాజకీయాలపై తమదైన ముద్ర వేసిన మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంచుకున్న దారులు, అనుసరించిన పద్ధతుల గురించి అమర్ ఈ పుస్తకంలో విశ్లేషించారు.

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు విశాఖ విద్యార్థులు



ఎంపికైన చిన్నారులతో కోచ్ శ్రీనివాస్

డాబాగార్డెన్స్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు విశాఖ నుంచి పలువురు ఎంపికయ్యారు. దండుబజార్ సమీపంలోని ఎంవీడీ పాఠశాలలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న డ్రాగన్ టైగర్స్ చైనీస్ కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి, కోచ్ నీలాపు శ్రీనివాసరావు ఈ విషయాన్ని మంగళవారం తెలిపారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. విశాఖ నుంచి ఫెడరేషన్ తరపున కె.కార్తీక్, కృష్ణ మనోహర్, ఎం.కార్తికేయ పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

శతశాతానికి చేరువలో..

- జిల్లాలో 84.82 శాతం కుల గణన పూర్తి
- 607 సచివాలయాల పరిధి 12,092 క్లస్టర్లలో నిర్వహణ
- 17.25 లక్షల మంది వివరాల సేకరణ
- వివరాల నమోదుకు నేటి వరకు అవకాశం

సాక్షి, విశాఖపట్నం: అణగారిన వర్గాల అభ్యున్నతి.. ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూతనందించేందుకు ప్రారంభించిన సంపూర్ణ కులగణన ప్రక్రియ జిల్లాలో ఈ నెల 4తో ముగిసింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని అందించడమే లక్ష్యంగా నిర్వహించిన గణనకు సంబంధించి 84.82 శాతం వరకు అధికార యంత్రాంగం పూర్తి చేసింది. కులగణనలో ప్రతీ ఇంటి నుంచి సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచింది. మిగిలిన వారి వివరాలను ఆయా సచివాలయాల్లో సేకరిస్తున్నారు.

కులాల వారీగా జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడం, సముచిత విధాన నిర్ణయాలు అమలు చేసేందుకు కులగణన ప్రక్రియ గత నెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ని రూపొందించింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రతి ఒక్కరికీ సంబంధించిన వివరాలను కులాల వారీగా సేకరించారు. దాదాపు 723 కులాల జాబితాలను ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వారీగా వర్గీకరించి మొబైల్ యాప్‌కు అనుసంధానించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబం ఏ సామాజికవర్గ కేటగిరీ పరిధిలోకి వస్తుందో యాప్‌లో ఎంటర్ చేయగానే.. కులాల జాబితా వస్తుంది. దాని ప్రకారం కుటుంబ సభ్యులు చెప్పే వివరాల మేరకు కులగణన ప్రక్రియ పూర్తి చేశారు. వీటితో పాటు నో-క్యాస్ట్ కేటగిరీని కూడా కులగణన ప్రక్రియలో పొందుపరిచారు. వాస్తవానికి జనవరి 28తోనే సర్వే పూర్తి కావాల్సి ఉండగా.. ప్రభుత్వం వారం రోజులు పొడిగించడంతో ఈ నెల 4వ తేదీతో అధికారులు సర్వే పూర్తి చేశారు.



కులగణన నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శి, వలంటీర్

జోన్/మండలం	సచివాలయాలు	క్లస్టర్లు	గృహాలు	కుటుంబ సభ్యులు	పూర్తయిన ఇళ్లు	కుటుంబ సభ్యులు
ఆనందపురం	18	383	21374	64045	20398	54298
భీమిలి	19	333	20935	62902	19395	54105
పద్మనాభం	16	337	17616	51172	16785	45576
పెందుర్తి	9	205	11825	34391	11275	30730
జోన్-1	15	347	18340	53513	16021	44439
జోన్-2	91	1636	96226	285119	80038	225566
జోన్-3	73	1828	91928	277258	75309	213458
జోన్-4	68	1146	69379	208139	56853	162318
జోన్-5	118	2508	139036	417802	116635	336973
జోన్-6	107	1991	144251	438892	122493	346771
జోన్-8	73	1378	85044	256696	72083	211540
మొత్తం	607	12092	715954	2149929	607285	1725774

జిల్లాలో 6.07 లక్షల ఇళ్లల్లో సర్వే పూర్తి

కలెక్టర్ డా.మల్లికార్జున పర్యవేక్షణలో జిల్లాలోని 607 సచివాలయాలను 12,092 క్లస్టర్లుగా విభజించి సర్వే జరిపారు. కులగణనలో భాగంగా కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఆధార్‌తో కూడిన ఈ-కేవైసీ తీసుకోవడంతో పాటు బయోమెట్రిక్, ఐరిష్ తదితర విధానాల ద్వారా గణన జరిగింది. మొత్తం 7,15,954 గృహాలుండగా నిర్దిష్ట గడువులోపు 6.07 లక్షల ఇళ్లల్లో సర్వే పూర్తి చేశారు. క్షేత్రస్థాయిలో కుటుంబంలో సభ్యులు అందుబాటులో లేకపోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండటం వల్ల 1,08,669 ఇళ్లకు సంబంధించి 4,24,155 మంది వివరాలు సేకరించలేకపోయారు. ప్రస్తుతం వీరి వివరాలు సేకరించే పనిలో సచివాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు.

నేటి వరకు అవకాశం



కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మార్గదర్శకాలతో జిల్లాలో 4వ తేదీ వరకు కులగణన పక్కాగా నిర్వహించాం. ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తిస్థాయిలో సామాజిక వర్గాల వారీగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వివరాలు సేకరించారు. గణన ప్రక్రియ సమయంలో వివిధ కారణాలతో నమోదు చేసుకోకుండా మిగిలిపోయిన వారికి మరో అవకాశం కూడా ప్రభుత్వం కల్పించింది. బుధవారం లోగా మీ పరిధిలోని సచివాలయాలకు కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియకు సహకరించాలని కోరుతున్నాం. 20వ తేదీ నాటికి సేకరించిన వివరాలకు సంబంధించిన సమగ్ర డేటాను ప్రభుత్వానికి అందజేయనున్నాం.

– పూర్ణిమాదేవి, డీఎల్‌డీవో

విమ్స్‌లో వైద్య పోస్టుల భర్తీకి 9న ఇంటర్వ్యూలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో కాంట్రాక్ట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్య పోస్టుల భర్తీకి ఈ నెల 9న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఖాళీగా ఉన్న 19 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. దీని కోసం ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా ఎలాంటి రాత పరీక్ష లేకుండా ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నామన్నారు. 9న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. స్పెషాలిటీ వైద్య పోస్టులకు నెలకు రూ.90 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టులకు రూ.1.60 లక్షల వేతనం చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉత్తీర్ణత పత్రాలతోపాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకుని విమ్స్‌లో జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు. అనస్తీషియా – 5, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ – 3, న్యూరాలజీ – 2, సర్జికల్ అంకాలజీ – 2, న్యూరో సర్జరీ – 1, ఎమర్జెన్సీ మెడిసిన్ – 1, సర్జికల్ గాస్ట్రో ఎంట్రాలజీ – 1, మెడికల్ అంకాలజీ – 1, ప్లాస్టిక్ సర్జరీ – 1, ఎండోక్రైనాలజీ – 1, పల్మనాలజీ – 1 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు.

రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి మంగళవారం సందర్శించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్య ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఎవ్వరూ బాధ్యతలు చేపట్టలేదు. దీంతో ఆర్డీవో ఆ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఇక్కడ రెవెన్యూకి సంబంధించిన పనులు ఏవిధంగా జరుగుతున్నాయో ఆరా తీశారు. కొద్ది రోజులుగా జరుగుతున్న జగనన్న సెంట్ భూమి ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ ప్రక్రియ తొందరగా జరిపించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యాలయంలో జరగాల్సిన కార్యకలాపాలపై దిశానిర్దేశం చేశారు. రూరల్ మండలం పరిధిలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులు సుమారు 25 వేల మంది ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

బై బై వైజాగ్

తిరుగు ప్రయాణమైన భారత క్రికెటర్లు



విశాఖ విమానాశ్రయంలో క్రికెటర్ గిల్

గోపాలపట్నం: భారత్ క్రికెటర్లు రోహిత్ శర్మ, శుభమన్ గిల్ తదితరులు మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు విశాఖ విమానాశ్రయం నుంచి తమ స్వస్థలాలకు బయలుదేరారు. విమానాశ్రయంలో వీరిని చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. వీరితో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపించారు. కాగా.. వైఎస్సార్ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

మిలాన్‌కు చురుగ్గా ఏర్పాట్లు

బీచ్‌రోడ్డు: నగరంలో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న మిలాన్-2024కు సాగరతీరం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా తీరంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిలాన్ సందర్భంగా నావికాదళం ప్రదర్శించే విన్యాసాలను ప్రేక్షకులు తిలకించేందుకు వీలుగా ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. మిలాన్ 2024లో 40కిపైగా దేశాల నావికాదళాలు పాల్గొని.. వారి యుద్ధ విన్యాసాలు, ఆ దేశాపు సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శిస్తారు.

108లో పండంటి బిడ్డకు జననం



108 వాహనంలో క్షేమంగా ఉన్న తల్లీ బిడ్డ

పెందుర్తి: పురిటి నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్న గర్భిణికి 108లోనే సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాలివీ.. పెందుర్తి మండలం గుర్రంపాలేనికి చెందిన ఎ.శ్రావణికి మంగళవారం తీవ్రంగా పురిటినొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కి సమాచారం అందించారు. సింహాచలం 108 సిబ్బంది సకాలంలో శ్రావణి ఇంటికి చేరుకుని ఆమెను వాహనంలోకి ఎక్కించుకున్నారు. ఆమెను డెలివరీ కోసం పెందుర్తి సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని పక్కకు నిలిపి ఆమెకు సుఖ ప్రసవం చేయించారు. శ్రావణికి రెండో కాన్పులో పండంటి ఆడబిడ్డ పుట్టింది. తదుపరి సంరక్షణ నిమిత్తం తల్లీబిడ్డను పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సిబ్బంది శ్రీరామమూర్తి, రామారావులను 108 జిల్లా కో-ఆర్డినేటర్ సురేష్, జిల్లా మేనేజర్ త్రినాథ్, శ్రావణి కుటుంబ సభ్యులు అభినందించారు.

వందేభారత్‌కు సామర్లకోట హాల్ట్ కొనసాగింపు

తాటిచెట్లపాలెం: విశాఖ–సికింద్రాబాద్–విశాఖ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఇటీవల తాత్కాలికంగా సామర్లకోటలో హాల్ట్ కల్పించారు. ఇరు వైపులా ఈ రైలుకు సామర్లకోట హాల్ట్‌కు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో స్వయం సహాయక సంఘాల సభ్యులు 60 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ పాపునాయుడు తెలిపారు. అనూష్ సంస్థ సహకారంతో ద్వారకానగర్‌లోని ఆ సంస్థలో ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బ్యాచ్‌లో ఎంపికైన 30 మంది సభ్యులు శిక్షణ తరగతులకు హాజరుకానున్నారని, శిక్షణ అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలతో పాటు కిట్లు అందజేయనున్నట్లు పాపునాయుడు వివరించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

మహారాణిపేట: బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, గొండు సీతారాం సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్య, పోలీస్, వైద్య ఆరోగ్య తదితర శాఖలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో 'బాలల హక్కులు, పరిరక్షణ'పై ప్రాంతీయ స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాల కార్మిక కేసులు, ప్రభుత్వం అందిస్తున్న నిధులు, చేపట్టిన చర్యలు, లబ్ధిపొందిన వారి వివరాలపై ఈ సందర్భంగా చైర్మన్ ఆరా తీశారు. ఆరు జిల్లాల్లో రెండేళ్లుగా జరిగిన బాల్య వివాహాల కేసులు, పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులు, పోక్సో తదితర కేసుల నమోదు, ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణపత్రాల జారీ తదితర అంశాలపై చర్చించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలను అడిగి తెలుసుకున్నారు. బాలల హక్కులు, వారి సంక్షేమంపై ప్రభుత్వ శాఖల సహకారం, అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల వివరాలు సేకరించారు. గిరిజన ప్రాంతాల్లోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న భోజనం తీరు తెన్నులపై మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. సదస్సులో చర్చించిన వివిధ అంశాలతో ప్రభుత్వానికి పలు సిఫారసులు చేస్తామన్నారు. చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రాంతీయ స్థాయి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు క్రైం డీసీపీ వెంకటరత్నం, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కో-ఆర్డినేటర్ జి. తిరుపతిరావు, విశాఖ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్లు, ఆరు జిల్లాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొత్స ఝాన్సీకి అభినందనలు



వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీని అభినందిస్తున్న నాయకులు

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ విశాఖపట్నం పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన బొత్స ఝాన్సీని పలువురు మంగళవారం కలసి అభినందనలు తెలిపారు. రెండు సార్లు పార్లమెంట్ సభ్యురాలిగా, జిల్లా పరిషత్ చైరపర్సన్‌గా సేవలందించిన బొత్స ఝాన్సీ విశాఖపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమితులు కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకటరమణారెడ్డి, హోటల్ మర్చంట్ అసోసియేషన్ కోశాధికారి సంజీవరెడ్డి, బాబా రీడింగ్ రూమ్ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ బోర కుమారరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, శివకుమార్‌రెడ్డి ఆమెను కలిసిన వారిలో ఉన్నారు.

దైవ దర్శనం చేసుకొని వస్తూ..
తిరిగిరాని లోకాలకు..

- లారీ ఢీకొని ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- రోదనలతో మిన్నంటిన పెదవాల్తేరు



మణికంఠ(ఫైల్)



నిరంజన్(ఫైల్)



మృతదేహాలను పరిశీలిస్తున్న పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

పీఎంపాలెం: దైవ దర్శనానికి వెళ్లి.. ఇంటికి తిరిగి వస్తున్న ఇద్దరు విద్యార్థులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. లారీ ఢీకొనడంతో ఇద్దరూ సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందారు. బోరవానిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలివీ.. పెదవాల్తేరు ప్రాంతంలో పారిడా సురేష్, కొల్లి రమణ కుటుంబాలు ఇరుగు పొరుగున నివసిస్తున్నాయి. సురేష్ కుమారుడు నిరంజన్ (20) నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ, రమణ కుమారుడు మణికంఠరెడ్డి (18) ఐటీఐ చదువుతున్నారు. కాగా.. విజయనగరంలోని ప్రముఖ ఆలయాల దర్శనం కోసం మంగళవారం ఉదయం మణికంఠ, నిరంజన్ కలసి ఒక బైక్ మీద, మరో ఇద్దరు స్నేహితులు మరో బైక్‌పై వెళ్లారు. అక్కడ దైవ దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. బోరవానిపాలెం డంపింగ్ యార్డ్ ప్రాంతంలోకి వచ్చే సరికి నగరం వైపు గ్యాస్ లోడుతో వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై పడిపోగా.. వారి మీద నుంచి లారీ దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ కాంతారావు, ఎస్ఐ వెంకటరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రమణకు మణికంఠతో పాటు కుమార్తె ఉంది. సురేష్‌కు నిరంజన్‌తో పాటు మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాగా చదువుకుని.. ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తల్లిదండ్రులు భావించారు. అయితే పిల్లలు అర్థాంతరంగా చనిపోవడంతో వారి రోదనలు మిన్నంటాయి. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూర్తి.. బ్రోకర్ రాజకీయాలు మానుకో..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవిరెడ్డి హెచ్చరిక



సాక్షి, విశాఖపట్నం: జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌పై వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి జి.రవిరెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రోకర్ రాజకీయాలు తప్పించి.. గెలిపించిన వార్డు కోసం ఏనాడైనా ఆలోచన చేశావా అని మూర్తిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను విమర్శించే స్థాయి నీకు లేదని హెచ్చరించారు. గతంలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడు రెట్లు ఎక్కువగా జరిగిందన్నారు. మంత్రి అమర్‌నాథ్ అక్రమంగా సంపాదించారంటూ దుష్ప్రచారం చేస్తున్నావని, ఒక్క ఆధారమైనా చూపించగలవా అని ప్రశ్నించారు. ముందు నీ స్థాయికి తగ్గట్టుగా మాటలు నేర్చుకోవాలని మూర్తికి హితవు పలికారు. ఏ స్టాండూ లేని జనసేనలో నువ్వు జోకర్ లాంటి వాడివని.. ఇకనైనా బ్రోకర్ రాజకీయాలు, పిచ్చి పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(06073) స్పెషల్ రైలు చెన్నై సెంట్రల్‌లో సోమవారాల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 11.17 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ భువనేశ్వర్‌లో మంగళవారాల్లో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 3.42 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 3.44 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 3 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఫిబ్రవరి 6 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు నడుస్తుంది. గూడూరు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం, పలాస, ఖుర్దారోడ్ స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

నవోదయలో జూనియర్‌పై సీనియర్ల దాడి

ఒకరికి స్వల్ప గాయాలు



విద్యార్థి వీపుపై గాయాలు

కొమ్మాది: కొమ్మాది నవోదయలో జూనియర్‌పై సీనియర్లు దాడి చేయగా.. జూనియర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులు తెలిపిన వివరాలివీ.. జవహర్ నవోదయ విద్యాలయలో 10వ తరగతి విద్యార్థులను కొందరు ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు సోమవారం రాత్రి వేధించారు. ఈ క్రమంలో ఓ విద్యార్థికి తాము చెప్పిన పనులు చేయాలని, లేకుంటే ఒప్పుకునేది లేదని హెచ్చరించారు. దీనికి ఆ విద్యార్థి అంగీకరించకపోవడంతో నలుగురు సీనియర్లు అతనిపై దాడికి దిగారు. ఈ ఘటనలో అతని వీపుపై స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ సంజయ్, పీఎంపాలెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా సోమవారం రాత్రి జరిగిన ఘటన వాస్తవమే అని చెప్పారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. దాడి చేసిన విద్యార్థులను మందలించినట్లు తెలిపారు.